హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.119	173	196
సూర్యాపేట	రూ.120	170	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.4



విద్యుత్‌శాఖపై బకాయిల భారం

విద్యుత్ బిల్లు చెల్లించడంలో ఒక్కరోజు ఆలస్యమైతే వినియోగదారులకు జరిమానా విధిస్తారు. అదే ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు కోట్ల రూపాయల బకాయి ఉన్నా విద్యుత్ సంస్థ అపరాధ రుసుము విధించకపోగా, ఉదారంగా వ్యవహరిస్తోంది. దీంతో బకాయిలు పెరుగుతూ వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.134.76కోట్ల మేర ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ సంస్థకు బకాయి ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.66కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.34.08కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.34.68కోట్ల బకాయిలు ఉన్నాయి.

- నల్లగొండ టౌన్, భువనగిరి టౌన్, భానుపురి

- ప్రభుత్వ కార్యాలయాలవే అత్యధికం
- ఉమ్మడి జిల్లాలో రూ.134.76కోట్లు
- నల్లగొండ జిల్లాలో రూ.66కోట్లు
- సూర్యాపేట జిల్లాలో రూ.34.08కోట్లు
- జిల్లాలో రూ.34.86కోట్లు

విద్యుత్ బకాయిలను అరికట్టేందుకు గతంలోనే ప్రీపెయిడ్ మీటర్లను తీసుకువచ్చినా అది అంతగా ఫలితాలు ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. నల్లగొండ జిల్లాలో 11,210 ఎల్‌టీ, హెచ్‌టీ ప్రభుత్వ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వివిధ శాఖల కార్యాలయాలు, తాగునీటి పథకాలు, మునిసిపాలిటీలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. మితిమీరి బకాయిలు ఉన్న కార్యాలయాలకు మాత్రం విద్యుత్ అధికారులు నోటీలు జారీ చేస్తూ అప్పుడప్పుడు కనెక్షన్ కట్ చేసి తిరిగి పునరుద్ధరిస్తున్నారు. దీంతో బకాయిలు వసూలు కావడం లేదు. తొలగిస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో రూ.50.35కోట్ల విద్యుత్ బిల్లులు బకాయిలు ఉండగా, అందులో ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సినవి రూ.34.86 కోట్లు. మిగతా రూ.15.49కోట్లను ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ సంస్థకు వసూలు కావాల్సి ఉంది. జిల్లాలో అన్ని కేటగిరీల కు చెందిన విద్యుత్ కనెక్షన్లు 4,26,702 ఉన్నాయి. వీటిలో 5,493 ప్రభుత్వ శాఖల కనెక్షన్ల నుంచి రూ.34,86,41,000 బకాయి లు రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో బిగించిన 921 ప్రీపెయిడ్ సర్వీసులు అప్‌డేట్‌గా ఉండటంతో బకాయిల భారం కొంత తగ్గింది. అత్యధికంగా 3,540 కనెక్షన్లు ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఏకంగా రూ.27,01,99,000 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాతి స్థానంలో జిల్లాలోని ఆరు మునిసిపాలిటీల్లో 531 కనెక్షన్లు ఉండగా, బకాయిలు రూ.6,48,8000 ఉన్నాయి. మూడు కనెక్షన్లు ఉన్న సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్, ఒక కనెక్షన్ ఉన్న మరో ప్రభుత్వశాఖలో విద్యుత్ బకాయిలే లేకపోవడం విశేషం. విద్యాశాఖలో 335 కనెక్షన్లు ఉండగా రూ.57.04లక్షలు, 67 కనెక్షన్లు ఉన్న పోలీస్‌శాఖ రూ.39.76 లక్షలు, 117 కనెక్షన్లు ఉన్న సంక్షేమశాఖ రూ.7.4లక్షలు, 53 కనెక్షన్లు ఉన్న పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.6.89లక్షలు, 57 కనెక్షన్లు ఉన్న రెవెన్యూశాఖ రూ.4.27లక్షలు, 230 కనెక్షన్లు ఉన్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్‌శాఖ రూ.3.34లక్షలు బకాయి పడ్డాయి. మరో నాలుగు శాఖలు రూ.5.95లక్షలు బకాయి ఉండగా, మిగతా 15 ప్రభుత్వ శాఖల 555 కనెక్షన్ల నుంచి రూ.5.23లక్షలు విద్యుత్ శాఖకు రావాల్సి ఉంది.

గ్రాంట్ వస్తేనే బిల్లుల చెల్లింపు

ప్రభుత్వం గ్రాంట్లను విడుదల చేస్తేనే సంబంధిత శాఖలు విద్యుత్ బిల్లులను చెల్లించడంతో పాటు కార్యాలయాల నిర్వహణ సులువవుతుంది. కానీ, ప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో చేస్తున్న జాప్యంతో పలు ప్రభుత్వ శాఖలు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించలేకపోతున్నాయి. ఇది ట్రాన్స్‌కోకు గుదిబండగా మారుతోంది. బిల్లుల వసూలు కోసం ట్రాన్స్‌కో అధికారులు సంబంధిత ప్రభుత్వశాఖల కార్యాలయాలకు లేఖలు రాయడం పరిపాటిగా మారింది. అయినా బిల్లులు వసూలు కావడం లేదు.

నల్లగొండ జిల్లాలో ఇలా..

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం రూ.66,19,93,000 విద్యుత్‌శాఖకు చెల్లించాల్సి ఉంది. అందులో అత్యధికంగా గ్రామపంచాయితీలు, మునిసిపాలిటీలవే ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి 8,048 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ.47.76కోట్లు బకాయి పడ్డాయి. మునిసిపాలిటీలకు సంబంధించి 1,683 కనెక్షన్‌లకు రూ.11.33కోట్ల బకాయిలు ఉన్నాయి. 14 శాఖలకు చెందిన కార్యాలయాలకు సంబంధించి 1,479 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రూ.7.10కోట్ల మేర విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా విద్యాశాఖ రూ.3.46కోట్లు, ఎత్తిపోతల పథకాల బకాయిలు రూ.1.50కోట్లు ఉన్నాయి. పోలీస్ క్వార్టర్స్‌కు సంబంధించి మిర్యాలగూడలో రూ.51.01లక్షలు, నల్లగొండలో రూ.44లక్షలు, దేవరకొండలో రూ.25.22లక్షలు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ రూ.43.50లక్షలు, రెవెన్యూశాఖ రూ.20.62లక్షలు బకాయిలు పడ్డాయి. బీసీ వెల్ఫేర్ రూ.1.20లక్షలు, పోలీస్‌శాఖ రూ.7.02లక్షలు, జైళ్ల శాఖ రూ.1.01లక్షలు, సాంఘికసంక్షేమశాఖ రూ.5.47లక్షలు, గిరిజన సంక్షేమశాఖ రూ.3.32లక్షలు, ఏరియా ఆస్పత్రులు రూ.8.51లక్షలు, పశుసంవర్ధశాఖ రూ.1.92లక్షలు విద్యుత్ శాఖకు బకాయిపడ్డాయి.

బకాయిల వసూలుకు చర్యలు

జిల్లాలో పేరుకుపోయిన ప్రభుత్వరంగ సంస్థల బకాయిల వసూలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా అత్యవసర సర్వీసులైన ఆస్పత్రులు, సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన బకాయిల విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించి మినహాయింపు ఇస్తున్నాం. ఇక గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేసి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి బిల్లులు కట్టిస్తున్నాం. బిల్లు చెల్లించలేని పక్షంలో విద్యుత్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- టీఆర్.చంద్రమోహన్, నల్లగొండ జిల్లా ఎస్ఈ

బకాయిలు చెల్లించాలని కోరుతున్నాం



ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలని ఎప్పటికప్పుడు కోరుతున్నాం. అందుకు సంస్థ సిబ్బంది క్రమం తప్పకుండా కార్యాలయాలకు వెళ్తుండటంతో పాటు లేఖలు రాస్తున్నారు. అయినప్పటికీ సకాలంలో బిల్లులు వసూలు కావడం లేదు. ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేసినప్పుడే బిల్లులు వసూలవుతున్నాయి. ప్రజావసరాలు, పాలన దృష్ట్యా ప్రభుత్వ సర్వీసుల విషయంలో పట్ల కఠినంగా వ్యవహరించలేకపోతున్నాం.

- ఐ.శ్రీనాథ్, యాదాద్రి జిల్లా ఎస్ఈ

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.బిల్లులు పెండింగ్ ఉన్న ఆయాశాఖలకు నోటీసులు జారీ చేస్తాం.

- పాల్‌రాజ్, సూర్యాపేట జిల్లా ఎస్ఈ

సూర్యాపేట జిల్లాలో రూ.34.08కోట్లు

సూర్యాపేట జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.34.08కోట్ల బకాయిలు ఉండగా, అందులో గ్రామ పంచాయతీల బిల్లులే అత్యధికంగా ఉన్నాయి. జిల్లాలో 475 పంచాయతీలు రూ.29.98కోట్ల మేర బకాయి పడ్డాయి. చింతలపాలెం మండలంలో రూ.3.57కోట్లు అత్యధికంగా బకాయిలు ఉన్నాయి. ఆ తరువాత మఠంపల్లి మండలంలో రూ.2.52కోట్లు, పెన్‌పహాడ్ మండలంలో రూ.2.15కోట్లు, చిలుకూరు మండలంలో రూ.2.09కోట్లు బకాయిలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఐదు మునిసిపాలిటీలు విద్యుత్‌శాఖకు రూ.1.89కోట్లు బకాయి పడ్డాయి. సూర్యాపేట మునిసిపాలిటీ రూ.5.19లక్షలు, తిరుమలగిరి రూ.71.61లక్షలు, హుజూర్‌నగర్ రూ.22.17లక్షలు, నేరేడుచర్ల రూ.18.78లక్షలు, కోదాడ రూ.71.92 లక్షలు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాలు రూ.2.31కోట్లు చెల్లించాల్సి ఉంది. వ్యవసాయశాఖ రూ.1.60లక్షలు, పశుసంవర్ధక శాఖ రూ.2.64లక్షలు, విద్యుత్ కార్యాలయాలు రూ.0.66లక్షలు, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ రూ.2.09లక్షలు, నీటిపారుదలశాఖ రూ.7.02లక్షలు, హెల్త్ అండ్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ రూ.58.09లక్షలు చెల్లించాల్సి ఉంది. ఉన్నత విద్యాశాఖ రూ.1.35లక్షలు, గృహనిర్మాణశాఖ రూ.2.52లక్షలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.0.54లక్షలు, పాఠశాల విద్యాశాఖ రూ.1.47కోట్లు, ఆర్అండ్‌బీ రూ.3.20లక్షలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూ.3.43లక్షలు, యూత్ అడ్వాన్స్‌మెంట్ అండ్ టూరిజంశాఖ రూ.0.28లక్షలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు రూ.0.13లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఎట్టకేలకు కుదిరిన ముహూర్తం

- మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లు
- కలెక్టర్‌కు అవిశ్వాస ప్రతిపాదన అందజేత



మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

మోత్కూరు, జనవరి 20: మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం కుదిరింది. చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి మేఘారెడ్డిపై 12మంది కౌన్సిలర్లకు గాను తొమ్మిది మంది అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ శనివారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు ఎనిమిది మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాసం ప్రకటిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు బొల్లెపల్లి వెంకటయ్య (వైస్‌చైర్మన్), పురుగుల వెంకన్న, లెంకల సుజాత, వనం స్వామి, దబ్బెటి విజయ, కాంగ్రెస్ కౌన్సిలర్లు గుర్రం కవిత, కారుపోతుల శిరీష, మలిపెద్ది రజిత, ఎర్రవెళ్లి మల్లమ్మ సంతకాలు చేశా రు. తొమ్మిది మంది కౌన్సిలర్లు స్వయంగా కలెక్టర్ వద్దకు వెళ్లి అవిశ్వాస ప్రతిపాదనను అందజేశారు. చైర్‌పర్సన్ సావిత్రి భర్త మేఘారెడ్డి వ్యవహరించిన ఏక పక్షవైఖరి, తోటి కౌన్సిలర్లకు పనులు ఇవ్వకపోవడంతో విసిగి ఆమెపై అవిశ్వాసం పెట్టినట్టు అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు తెలిపారు.

చైర్‌పర్సన్ భర్త వ్యవహారశైలే కారణమా..?

మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ సావిత్రిమేఘారెడ్డిపై అవిశ్వాసం పెట్టాలని, సుమారు ఏడాది కాలంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు తిరుగులేని మెజార్టీ ఉన్నప్పటికీ చైర్‌పర్సన్ సావిత్రి భర్త మేఘారెడ్డి వ్యవహారశైలిని సొంత పార్టీ కౌన్సిలర్లే జీర్ణించుకోలేక పోయారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కాంగ్రెస్ కౌన్సిలర్లు తోడవడంతో 9మంది కౌన్సిలర్లు శనివారం అవిశ్వాస ప్రతిపాదనను కలెక్టర్‌కు అందజేశారు.

భువనగిరి చైర్మన్, వైస్‌చైర్మన్ రాజీనామా

భువనగిరి టౌన్, జనవరి 20: అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశానికి మూడు రోజులముందే భువనగిరి మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు,వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య శనివారం తమ పదవులకు రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కౌన్సిల్‌లో 35 మంది సభ్యులకు 31 మంది సభ్యులు వారిరువురిపై అవిశ్వాస తీర్మానం నోటీసులను ఇచ్చిన నేపథ్యంలో అధికారులు ఈ నెల 23న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పాలకపక్షానికి చెందిన 16 మంది అసంతృప్త కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం శిబిరానికి వెళ్లగా తొమ్మిది మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు స్థానికంగానే ఉంటూ అవిశ్వాస తీర్మానం సమావేశం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా చైర్మన్, వైస్‌చైర్మన్ శనివారం సాయంత్రం మునిసిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డికి రాజీనామా పత్రాలు అందజేయడం మునిసిపల్ అవిశ్వాస రాజకీయాల్లో కొత్త ట్విస్ట్‌కు దారి తీసింది. రాజీనామా లేఖలతో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన కౌన్సిలర్లందరూ అప్రమత్తమయ్యారు. అయితే అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశం జరిగే 23 లోపు సాంకేతికంగా వారిద్దరి రాజీనామాలు ఆమోదం పొందే అవకాశాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రాజీనామాలు చేసినప్పటికీ అవిశ్వాస తీర్మానం సమావేశం 23న జరుగుతుందని అధికారులు అంటున్నారు.

భువనగిరి ఎంపీపీపై అవిశ్వాసం

భువనగిరి రూరల్, జనవరి 20: భువనగిరి ఎంపీపీ నరాల నిర్మలపై అవిశ్వాసాన్ని ప్రవేశపెడుతూ రాజకీయాలకు అతీతంగా 10 మంది ఎంపీటీసీలు శనివారం భువనగిరి అదనపు కార్యాలయ అధికారులకు తీర్మాన ప్రతిని అందజేశారు. మండల పరిషత్‌తో మొత్తం 13 మంది ఎంపీటీసీలకు 10మంది సభ్యులు అవిశ్వాన్ని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీపీ నిర్మల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు నుంచే ఆమెపై సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, ఎంపీటీసీలు ఉడుత శారద, కంచి లలిత, గునుకుంట్ల కల్పన, సామల వెంకటేష్, బొక్క కొండల్‌రెడ్డి, రాసాల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను బలమైన శక్తిగా నిలపడమే ధ్యేయం

కేంద్ర విద్యుత్ పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్



కార్యక్రమంలో కేంద్రమంత్రి రాజ్‌కుమార్ సింగ్

బీబీనగర్, జనవరి 20: భారత దేశాన్ని ప్రపంచంలోనే బలమైన శక్తి కలిగిన దేశంగా నిలపడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర విద్యుత్ పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తుందన్నారు. 2047నాటికి భారత దేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలపాలని మోదీ సంకల్పించి, వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా సాధించిన ఆర్థిక స్వావలంబన ప్రగతిని ప్రజల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చామని, విద్యుత్ కనెక్షన్‌లేని ఇల్లు లేదన్నారు. ప్రతీ ఇంటికి తాగు నీరు అందించామని, ప్రతీ పేదవానికి పక్కా ఇల్లే లక్ష్యంతో ఇప్పటివరకు 3 కోట్ల ఇళ్లను మంజూరు చేశామన్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి ఉన్నతస్థితికి తీసుకొచ్చామన్నారు.

ప్రతీ రంగంలో అభివృద్ధి

ప్రతీ రంగంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని, తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన 3వ దేశంగా నిలిపామని కేంద్ర మంత్రి అన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల మందికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించామని, జన ఔషధ కేంద్రాలను ప్రారంభించామన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మెరుగైన వైద్యసాయం అందించడంలో భాగంగా ఎయిమ్స్ సేవలను దేశవ్యాప్తంగా విస్తృత పరుస్తున్నామన్నారు.

మరోపక్క పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదుల దురాక్రమణదారుల నుంచి దేశాన్ని రక్షిస్తూ తీవ్రవాదాన్ని సమర్థంగా అంతమొందిస్తున్నామన్నారు. దేశాన్ని చిన్నాభిన్నం చేసే అవినీతి పరులపట్ల తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో కలిసి లిక్కర్ స్కాంకు పాల్పడ్డారని, వీరిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రి ఎయిమ్స్ అధికారులతో సమావేశమై ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ వికాస్ భాటియా ఎయిమ్స్ ప్రగతిని వివరించారు. అనంతరం 20 స్వయం సహాయక సంఘాలను కలుపుకుని రూ.3కోట్లు విలువైన చెక్కును కేంద్ర మంత్రి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, బ్యాంకు ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం శాంతికుమార్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బిపిన్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



భువనగిరిలో పోలింగ్ స్టేషన్‌ను తనిఖీచేస్తున్న కలెక్టర్ హనుమంత్ కే.జండగే

భువనగిరి రూరల్, బీబీనగర్, జనవరి 20: 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పురస్కరించుకొని శనివారం భువనగిరి, బీబీనగర్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు నమోదుకు ఫాం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటరు నమోదుకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, బీబీనగర్ తహసీల్దార్లు అంజిరెడ్డి, శ్రీధర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రుక్నోద్దీన్, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

దేవాలయాల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచాలి



బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

భూదాన్‌పోచంపల్లి,జనవరి 20: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని ఈ నెల 22న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించాలని, ఆలయ ఆవరణలు పరిశుభ్రంగా ఉండేట్లు చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కోరారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, మాజీ సర్పంచు నోముల గణేష్, నాయకులు ఎర్ర లక్ష్మణ్, పంతంగి వినయ్‌కుమార్, రచ్చ సత్యనారాయణ, గంజి బస్వలింగం, గోదాసు లింగస్వామి, కానుగు పాండు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న పట్టణంలోని మహమ్మాయి దేవాలయంలో ఆంజనేయ స్వామికి అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధాన అర్చకులు మహంకాళి శ్రీనివాస్‌శర్మ, ఆలయ చైర్మన్ చేపూరి రామ్మోహనచారి తెలిపారు.



మిగతా సేవలు ఎప్పుడో?

- తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏర్పాటు చేసి ఏడు నెలలు
- 134 సేవలకు 74 మాత్రమే అందుబాటులోకి
- ఖాళీ పోస్టులతో సేవలకు అంతరాయం

•7లో..



లక్ష్మీనృసింహుడికి ఘనంగా

నిత్యవిధి కైంకర్యాలు

- తులసీదళార్చన, సుదర్శన నారసింహ హోమం
- రూ.27,69,587 ఆదాయం

ఇరువర్గాల మధ్య ఘర్షణ

మాడ్గులపల్లి, జనవరి 20 : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గజలాపురం గ్రామానికి చెందిన జక్క నాగయ్య పదేళ్ల కిందట ముద్ద మహేష్ కుటుంబసభ్యులకు రూ.12వేలు అప్పుఇచ్చారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య కొంతకాలంగా ఘర్షణ జరుగుతోంది. అందులో భాగంగానే శనివారం గ్రామంలో ముద్ద మహేష్, నాగయ్యల మధ్య గొడవ జరగడంతో నాగయ్యకు గాయాలయ్యాయి. బాధితుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అతి చిన్నసైజులో
రాములోరి పాదుకల తయారీ

నార్కట్‌పల్లి, జనవరి 20: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి అతిచిన్న రాములోరి పాదుకలను తయారు చేశారు. అయోధ్యలో చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 22న జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, రామ మందిర ప్రారంభోత్సవ పుణ్యకార్యాన్ని పురస్కరించుకుని తయారు చేసినట్లు తెలిపారు. రెండు పాదుకలను కేవలం 0.130 మిల్లీ గ్రాముల బంగారాన్ని వినియోగించి 8 మిల్లీ మీటర్ సైజు పొడవు, 4మిల్లీమీటరు సైజు వెడల్పుతో తయారు చేసినట్లు తెలిపారు. వీటిని తయారు చేయడానికి కేవలం గంట మాత్రమే సమయం పట్టిందని తెలిపాడు. కాగా గతంలో కూడా బతుకమ్మ, రాకెట్ నమూనా, జాతీయ పతాకం, శివలింగం, భారతదేశ పటం వంటి వాటిని అతి చిన్నసైజు పరిమాణంలో తయారు చేసి పలువురి మన్ననలు పొందాడు.




రాములోరి అతిచిన్న పాదుకలు, తయారు చేసిన స్వర్ణకారుడు శ్రీనివాసచారి

బ్రెయిన్‌డెడ్‌తో వ్యక్తి మృతి

అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



దుర్గయ్య(ఫైల్)

శాలిగౌరారం, జనవరి 20: అవయవదానంతో స్ఫూర్తిగా నిలిచారు నల్లగొండ జిల్లా శాలిగౌరారం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య కుటుంబ సభ్యులు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన అల్లి దుర్గయ్య(53) ఈ నెల 16న బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించేలోగా బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ఫౌండేషన్ దుర్గయ్య కుటుంబ సభ్యులను సంప్రదించింది. దీంతో వారి అంగీకారం మేరకు దుర్గయ్య లివర్, రెండు కళ్లను సేకరించారు. దుర్గయ్య చనిపోయిన మరో ఇద్దరికి చూపును ఇవ్వబోతున్నట్లు వైద్యులు తెలిపారు. దుర్గయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. దుర్గయ్య అవయవదానాలకు అంగీకరించిన కుటుంబ సభ్యులను సర్పంచ్ అల్లి సైదులుతో పాటు గ్రామస్థులు అభినందించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలి



కనగల్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కనగల్, జనవరి 20 : ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలుచేయాలని నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులకు న్యాయం చేస్తామన్న భరోసా కల్పించాలని సూచించారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరేడ్‌ను నిర్వహించారు. ఆయన వెంట చండూరు సీఐ ఏ వెంకటయ్య, ఎస్ఐ బీ రామకృష్ణయ్యగౌడ్, ఏఎస్ఐ సర్ఫరాజ్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా, జైలు

నల్లగొండ టౌన్, జనవరి 20 : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని నల్లగొండ ట్రాఫిక్ సీఐ బీ డానియల్ కుమార్ హెచ్చరించారు. శనివారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 34మందిని జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరిలో ఒకరికి 5 రోజులు, ఒకరికి 2, నలుగురికి ఒక రోజు జైలు, మిగిలిన 28 మందికి రూ.30వేల జరిమానా విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐతో పాటు, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

పాలకవీడు, జనవరి 20 : సూర్యాపేట జిల్లా పాలకవీడులో అతివేగంతో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పాపగంటి దేవదానం(50) శనివారం ప్రధానరహదారి మూలమలుపు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. జాన్‌పహాడ్ నుంచి నేరేడుచర్ల వైపు వస్తున్న టీఎస్28టీ 0459 నెంబరు గల అతివేగంతో వచ్చిన ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ అజాగ్రత్తగా కారణంగానే దేవదానం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దేవదానంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

లారీ ట్యాంకర్ ఢీకొని యువకుడికి గాయాలు

రామన్నపేట, జనవరి 20 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో కంటైనర్ ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన పరమేష్ బైక్‌పై రామన్నపేట నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా సబ్‌స్టేషన్ ఎదురుగా చిట్యాల నుంచి వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో రామన్నపేట ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు.

బత్తాయి చెట్లను నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

పెద్దవూర, జనవరి 20 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ఊట్లపల్లిలో 170 బత్తాయి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితుడు మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్లపల్లిలోని సర్వే నెంబరు 291లో రెండేళ్ల కిందట మల్లయ్య 230 బత్తాయి మొక్కలు నాటాడు. అయితే ఇదే సర్వే నెంబరులోని భూమి విషయంలో బూతరాజు సాయన్నతో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి 170 మొక్కలను నరికివేశారని బాధిత రైతు మల్లయ్య తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమానితులపై ఫిర్యాదు చేసినట్లు రైతు మల్లయ్య తెలిపారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఆటో దొంగ అరెస్ట్

కొండమల్లేపల్లి, జనవరి 20 : ఆటో దొంగతనం చేసిన కొప్పుల మహేశ్ అలియాస్ సాయి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లిలో నివాసముంటున్న ముడావత్ సుక్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 16న రోజు మాదిరిగానే తన ఇంటి ఎదుట ఆటోను నిలిపాడు. తెల్లవారుజామున లేచి చూసే సరికి ఆటో లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మండలంలోని కోల్‌ముంతలపహాడ్ స్టేజీ వద్ద తనిఖీ చేస్తుండగా నిందితుడు ఆటోతో సహా పట్టుబడినట్లు తెలిపారు. ఆటోను స్టేషన్‌కు తరలించి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ వీరబాబు, సిబ్బంది హేమూనాయక్, వెంకటేశ్‌లను సీఐ అభినందించారు.

రూ.22,900విలువైన మద్యం పట్టివేత

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బైపాస్ వద్ద కొండ్రెడ్డి రమేశ్ అనే వ్యక్తి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై ఓ వ్యక్తి ఫిర్యాదుతో దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో రూ.22,900 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

కోదాడ రూరల్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని హనుమాన్ జంక్షన్ నుంచి రెండు డీసీఎంలలో 85 ఆవులను తరలిస్తూ అదేసమయంలో పోలీసుల వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డట్లు ఆయన తెలిపారు. రెండు డీసీఎంలను స్వాధీనం చేసుకుని పశువులను తరలిస్తున్న బాణోతు రమేష్, కుర్రా సునీల్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పశువులను గోశాలకు తరలించామన్నారు.

మిగతా సేవలు ఎప్పుడో?



వైద్య పరీక్షల పేరుతో దోపిడీకి గురవుతున్న పేదలకు ఉపశమనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం డయాగ్నోస్టిక్ కేంద్రాలను ప్రారంభించింది. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ సగం సేవలే అందుబాటులోకి వచ్చాయి. దీంతో మిగతా రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేట్ లేదా హైదరాబాద్‌లోని ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. 2023 జూలై 1న ప్రారంభమైన తెలంగాణ డయగ్నోస్టిక్స్‌లో డిసెంబరు 31 వరకు 20,367 మందికి 63,078 రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

\- భువనగిరి టౌన్

భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్

- తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏర్పాటు చేసి ఏడు నెలలు
- 20,367 మందికి 63,078 రోగ నిర్ధారణ పరీక్షలు
- 134 సేవలకు 74 మాత్రమే అందుబాటులోకి
- ఖాళీ పోస్టులతో సేవలకు అంతరాయం

భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో 134 రోగ నిర్ధారణ పరీక్షల సేవలు ప్రజలకు అందాల్సి ఉంటుంది. కానీ నేటి వరకు కేవలం 74 పరీక్షలు మాత్రమే అందుబాటులో వచ్చాయి. వీటిలో అత్యధికంగా పరీక్షలు చేయించే 74 పరీక్షలు అందుబాటులోకి రావడం కాస్త శుభపరిణామం. మిగతా 60 పరీక్షలు కూడా దశల వారీగా అందుబాటులోకి వస్తాయని అధికారులు అంటున్నారు. కానీ అత్యధిక బిల్లు వేసే సిటీ స్కాన్, ఎంఆర్ఐ, టూడీ ఈకో తదితర పరీక్షలు అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత ఉపశమనం లభించనుంది. కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.6వేల నుంచి రూ.10వేల వరకు ప్యాకేజీల రూపకంలో ప్రైవేట్ ల్యాబ్‌లు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహించే విటమిన్ డీ, సీబీఎఫ్, థైరాయిడ్, కిడ్నీ, లివర్, షుగర్, డెంగ్యూ, కామెర్లు, కలరా తదితర రోగ నిర్ధారణ పరీక్షలు డయాగ్నోస్టిక్స్‌లో ఉచితంగా లభిస్తున్నాయి. మహిళల ప్రసవానికి ముందు నిర్వహించే ఏఎన్సీ ప్రొఫైల్ పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్, మమోగ్రఫీ, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, తదితర సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే రోగులు నేరుగా పరీక్షల కోసం డయాగ్నోస్టిక్స్‌కు వెళ్లే అవకాశం లేదు. ఏదేని ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీలలో సేకరించిన శాంపిల్స్‌ను మాత్రమే డయాగ్నోస్టిక్స్‌లో పరీక్షించి సుమారు 8, 9 గంటల్లో ఆన్‌లైన్‌లో రిపోర్టులు ఇస్తున్నారు. మరిన్ని సందర్భాల్లో ప్రభుత్వ వైద్యుల రిఫరెన్స్‌తో రోగులకు నేరుగా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇప్పటివరకు 20,367 మందికి పరీక్షలు

జిల్లా ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులోకి వచ్చిన 7నెలలుగా జిల్లాలోని 24 పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి 20,367 మందికి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 63,078 పరీక్షలు నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను నాలుగు వాహనాల ద్వారా భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్స్‌కు తరలిస్తున్నారు. పరీక్ష నిర్వహించిన అనంతరం రిపోర్టులను పీహెచ్‌సీలు, రోగుల ఈమెయిల్‌కు అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఇంటి వద్దనే రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులను 8, 9 గంటల లోపు పొందవచ్చును.

ఆలస్యానికి కారణాలివే..

రోగ నిర్ధారణకు సంబంధించి 134 పరీక్షలను ఉచితంగా నిర్వహించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన తెలంగాణ గయాడ్నోస్టిక్ హబ్‌లో కేవలం 74 సేవలు మాత్రమే అందుబాటులోకి రాగా మిగతా 60 సేవల కోసం నిరీక్షించడానికి పలు కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఏడు నెలల కిందటే డయాగ్నోస్టిక్స్ ఏర్పాటు జరిగిందని దశల వారీగా మిగతా సేవలు కూడా అందుబాటులోకి వస్తాయంటున్నారు. అయితే గుండె జబ్బులు పెరిగిపోతున్న నేపథ్యంలో టూడీ ఈకో తదితర పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. అందుకు సంబంధించిన ల్యాబ్ సామాగ్రి డయాగ్నోస్టిక్స్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని వినియోగించే అర్హులైన డాక్టర్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఆ పరీక్షలు నిర్వహించే డాక్టర్ల నియామకాలకోసం అధికారులు పలు మార్లు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే వేతనానికి వైద్యులు సుముఖత చూపకపోవడంతో ఆపోస్టులు ఖాళీగానే ఉంటూ రోగులకు సేవలు అందని పరిస్థితి నెలకొంది. మరికొన్ని నిర్ధారణ పరీక్షల కోసం యంత్రాలు సమకూరినా అందుకు అవసరమైన రసాయనాల సరఫరా లేకపోతుండటం, పూర్తిస్థాయి ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలు లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది.

డయాగ్నోస్టిక్స్‌తో కచ్చితత్వ రిపోర్టులు



తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో నిర్వహించే రోగ నిర్ధారణ పరీక్షలకు కచ్చితత్వంతో కూడిన రిపోర్టులు ఉండడం ప్రత్యేకత. ఉచితంగా అందుతున్న సేవలతో ప్రజలకు ప్రైవేట్ ల్యాబ్‌ల ఆర్థిక దోపిడి నుంచి విముక్తి లభిస్తోంది. మొగతా సేవలు దశల వారీగా అందుబాటులోకి వస్తాయి. ఖాళీల భర్తీకి నిరంతరం నోటిఫికేషన్లు ఇస్తున్నాం. ఆ పోస్టులు భర్తీ అయితే మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి.

\- డాక్టర్ చిన్నా నాయక్, సూపరింటెండెంట్

లక్ష్మీనృసింహుడికి ఘనంగా నిత్యవిధి కైంకర్యాలు

యాదగిరిగుట్ట, జనవరి 20: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమశాస్త్రరీతిలో ఘనంగా కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజల్లో భక్తులు కుటుంబసమేతంగా పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవోత్సవం, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,69,587 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.



గుట్టలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

స్వామి సేవలో సీఎంవో సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి

యాదగిరీశుడిని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణపుష్పార్చన పూజల్లో ఆయన పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ప్రాకార మండపంలో ఆశీర్వచనం చేశారు. దేవస్థాన అధికారులు స్వామివారి అభిషేక లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యకల్యాణాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనంతో పాటు ఇతర పూజాక్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

లక్ష్మీనృసింహస్వామిసన్నిధిలో తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం ఆదివారం క్షేత్రంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.4 లక్షలు స్వామి వారి పేరున డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 25వ తేదీ నుంచి 2025 జనవరి 25 వరకు వేలం కాలపరిమితి ఉంటుందన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు యువకుల బలవన్మరణం



విజయ్‌కుమార్(ఫైల్)

కోదాడ రూరల్, జనవరి 20 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దోరకుంట గ్రామానికి చెందిన పల్లా విజయ్‌కుమార్(19) కోదాడలోని అనురాగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విజయ్‌కుమార్ తండ్రికి తెలియకుండా స్నేహితుడికి రూ.10వేలు అప్పు ఇచ్చాడు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడిని మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తండ్రి నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం చెన్నాయిగూడెంలో చోటుచేసుకోగా స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బైరగోని జానయ్య కుమారుడు మహేష్(26) డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ నల్లగొండ పట్టణంలో తన మిత్రుడితో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. ఈ నెల 17న రూమ్‌లో క్రిమిసంహారక మందు తాగినట్లు మిత్రుడికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే మిత్రుడి ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మహేష్ మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది.



మహేష్(ఫైల్)

నవోదయ ప్రవేశ పరీక్షకు 73.11 శాతం హాజరు

పెద్దవూర / కొండమల్లేపల్లి / కోదాడ టౌన్ / తుంగతుర్తి, జనవరి 20 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి క్యాంప్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షలు శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించారు. మొత్తం 25 పరీక్షా కేంద్రాల్లో 4,623 మంది విద్యార్థులకు 3,380(73.11శాతం) మంది పరీక్షకు హాజరు కాగా 1243(26.89శాతం) మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో జిల్లా ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు పరిశీలించి, ఏర్పాట్ల గురించి పరీక్ష కేంద్రం చీఫ్ చేరిపల్లి శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 85 మంది విద్యార్థులకు 66 మంది పరీక్షకు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం చిన్నఅడిశర్లపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ తదితరులున్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించినట్లు ఎంఈవో సలీం షరీఫ్ తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో 201 మంది విద్యార్థులకు 37 మంది గైర్హాజరు కాగా 164 మంది హాజరయ్యారు. అలాగే సెయింట్ జోసెఫ్ సీసీరెడ్డి పాఠశాలలో 216 మంది విద్యార్థులకు 36 మంది గైర్హాజరు కాగా 180 మంది హాజరయ్యారని ఎంఈవో తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. 208 మంది విద్యార్థులకు 172 మంది హాజరయ్యారని ఎంఈవో లింగయ్య తెలిపారు.



పెద్దవూరలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ముగిసిన శాకాహార జంతు గణన

చందంపేట, జనవరి 20 : నల్లమల అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కొనసాగిన శాకాహార జంతు గణన శనివారంతో ముగిసినట్లు నల్లగొండ జిల్లా డీఎఫ్ఓ సర్వేశ్వర్ తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. దీని కారణంగా జంతువుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. చందంపేట మండలం చిత్రియాల, పెద్దమూల, బచ్చాపురం, పాలపేడ ప్రాంతాల్లో మూడు రోజులుగా అటవీ జంతు గణన చేపట్టినట్లు తెలిపారు. మనుబోతులు, దుప్పి, జింకలు, ఆడవికుక్కలు, అడవిపందులు, కృష్ణజింక, ఎలుగుబంటులు, చిరుత పులుల సంఖ్య పెరిగినట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలు గణంకాలతో సహా ఈ నెల 22న వెల్లడిస్తామని అటవీ అధికారులు తెలిపారు.

జపాన్, జర్మనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, జనవరి 20: కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖల కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్కామ్(ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్) జపాన్, జర్మనీల్లో నర్సింగ్ ఉద్యోగఅవకాశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పి.సాహితి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 30ఏళ్ల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లోమా పూర్తిచేసిన వారు జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.1.5, రూ.1.8లక్షల వేతనం అందనుందని పేర్కొన్నారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటీస్ ప్రోగ్రాం కోసం 18 నుంచి 28 ఏళ్ల అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో 60శాతం, అంతకంటే అధిక మార్కుల అభ్యర్థులు అర్హులన్నారు. జర్మనీలో ప్లేస్‌మెంట్ శిక్షణ సమయంలో నెలకు ఐఎన్ఆర్ రూ.లక్ష ఉపకారం వేతనం, ఉద్యోగ నియామకం తర్వాత నెలకు రూ.3లక్షలు వేతనం అందుతుందన్నారు. జర్మన్, జపాన్ భాషలపై రెసిడెన్షియల్ శిక్షణ, ఆయా దేశాల్లో పనిచేసేందుకు అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తామన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను ఈ నెల 27లోపు జీ మెయిల్ ద్వారా 8919047600, 9573945684, 6302292450 ఈ నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

నెట్‌వర్క్ లేక నిలిచిన బ్యాంక్ సేవలు

శాలిగౌరారం, జనవరి 20 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో శనివారం సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. నెట్‌వర్క్ రావడం లేదని బ్యాంక్ అధికారులు బ్యాంక్ ప్రధాన గేట్ ముందు బోర్డుపెట్టారు. నెట్‌వర్క్ లేక, ఖాతాదారులకు సేవలు నిలిపివేయడం జరిగింది అని బోర్డు పెట్టడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు నిరాశతో వెనక్కి వెళ్లారు.

నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

హాలియా, జనవరి 20 : నల్లగొండ జిల్లా హాలియాలో శనివారం నెంబరు ప్లేట్స్‌లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ గాంధీనాయక్ తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి ఆదేశాల మేరకు హాలియా సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో హాలియా సర్కిల్ పరిధిలో నెంబర్ ప్లేట్లు లేని 15 మోటార్ సైకిళ్లను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజ్ చేశారు. ఈసందర్భంగా సీఐ గాంధీనాయక్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు వేయించుకోవాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్పెషల్ డ్రైవ్‌లో హాలియా ఎస్ఐ శోభన్‌బాబు, నిడమనూరు ఎస్.ఐ. గోపాల్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి రైతువేదిక వద్ద వెలిసిన గుడిసెలు

కొండమల్లేపల్లి, జనవరి 20 : రైతులందరూ ఒకే చోట కూర్చొని సలహాలు, సూచనలు, సందేహాలు నివృత్తి చేసుకోవడానికి గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పచ్చర్లబావి సమీపంలో సర్వే నెంబరు 170లోని 20 గుంటల స్థలాన్ని కేటాయించి అందులో రైతు వేదికను నిర్మించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రానికి చెందిన కొంతమంది రైతువేదిక స్థలాన్ని ఆక్రమించి నాలుగు రోజుల కిందట గుడిసెలు ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని ఏవో వెంకన్న దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించారు. సర్పంచ్, గ్రామకార్యదర్శి సలహా మేరకు గుడిసెలు వేసినట్లు వారు చెప్పారని ఏవో తెలిపారు. అయితే గుడిసెలు వేసిన వ్యక్తులతో ఖాళీ చేయిస్తానని సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ తెలిపినట్లు ఏవో తెలిపారు. ఇదిలా ఉండగా రైతువేదిక స్థలం ఆక్రమణ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏవో చేశారు. అదేవిధంగా ఏవో సూచన మేరకు తహసీల్దార్ దివ్యారెడ్డి ఆదేశాలతో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దురాళ్లను గుర్తించారు. ఎవరైనా రైతువేదిక స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో వెంకన్న తెలిపారు.



రైతువేదిక స్థలంలో సర్వే చేస్తున్న అధికారులు

కల్తీ గడ్డి మందు పిచికారీతో ఎండిన వరిపొలం

సూర్యాపేటరూరల్, జనవరి 20 : కల్తీ గడ్డి మందు పిచికారీ చేయడంతో వరి పొలం ఎండిపోయింది. సూర్యాపేట జిల్లా కేంద్రం పరిధిలోని రాయినిగూడెం ఆవాసప్రాంతమైన రుపాలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు కొణతం కర్ణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తనకున్న 6 ఎకరాల పొలంతో పాటు మరో 6 ఎకరాలు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కలుపు ఎక్కువగా ఉందని హుజూర్‌నగర్ నుంచి ఒక మిత్రుని సలహాతో గడ్డి మందును హుజూర్‌నగర్‌లోని ఓ మందుల దుకాణంలో కొనుగోలు చేసి 10 రోజుల క్రితం పిచికారీ చేశాడు. ఆ తర్వాత పొలం ఎండిపోయింది. రోజు రోజుకు వరి మొక్క కుళ్లిపోతుండటంతో శనివారం వ్యవసాయాధికారులకు సమాచారం ఇచ్చాడు. సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఏవో మహ్మద్ జానిమీయా ఎండిపోయిన పొలాన్ని పరిశీలించారు. ప్రాథమిక విచారణ చేపట్టి రైతుకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని మందుల కంపెనీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎడ్ల వీరమల్లుయాదవ్, ముత్యాల సైదులు, ముత్యాల పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

చిట్యాల రూరల్ : వరి పంట మూడు రకాల కారణాలతో ఎండిపోతుందని, సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవని నల్లగొండ జిల్లా చిట్యాల ఏవో పగిడిమర్రి గిరిబాబు అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల్లో శనివారం ఏఈఓలు కృష్ణకుమారి, మోపిన్‌లతో కలిసి పలువురి రైతులకు సంబంధించిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరిపంటలు ఎండుతున్నాయని రైతులు ఎలాంటి దిగులు చెందవద్దని సరైన సమయంలో చేలకు అవసరమైన చర్యలను తీసుకుంటే నష్టనివారణ చేపట్టవచ్చన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..



కొండాపురంలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు.. చందేపల్లిలో కంపోస్టు షెడ్డు వద్ద కాకుండా పక్కన పడేసిన చెత్త



- వినియోగంలోకి రాని కంపోస్టు షెడ్లు
- పట్టించుకోని అధికారులు
- నీరుగారుతున్న లక్ష్యం

మోటకొండూర్, జనవరి 20: 'పల్లె సీమలు దేశానికి పట్టుగొమ్మలు' అన్నారు మహాత్మాగాంధీ. పల్లెటూళ్లు గ్రామస్వరాజ్యాలుగా స్వయం సంవృద్ధి సాధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృఢ సంకల్పంతో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ పచాయతీల ఆదాయం పెంపొందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లోని చెత్తను సేకరించి షెడ్లలో వేరు వేరుగా చేసి కంపోస్టు ఎరువులను తయారు చేయాలని కంపోస్టు షెడ్లను నిర్మించింది. మండలంలోని 18 గ్రామ పంచయతీలకు రూ.2.5లక్షల చొప్పున నిధులను కేటాయించింది. కంపోస్టు షెడ్లను నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా వాటిని వినియోగించ కపోవడంతో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తీసుకువచ్చి అక్కడే కాల్చి వేస్తున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో మాత్రం డంపింగ్ యార్డులను అసలే వినియోగించడం లేదు. దీంతో లక్షల రూపాయాలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి.

చెత్త సేకరణకు ట్రాక్టర్ల కొనుగోలు

గ్రామాల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను సమకూర్చింది. గ్రామాల్లో ఉదయం, సాయంత్రం ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కానీ సేకరించిన చెత్తలో ప్లాస్టిక్, కాగితాలు, ఖాళీ సీసాల ద్వారా కొంత వరకు ఆదాయం వస్తుందని ఆశించినా.. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో ఈ పథకం లక్ష్యాన్ని చేరుకోలేక పోతోంది. ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపిం గ్ యార్డుల వద్దకు నేరుగా తీసుకువచ్చి అక్కడే కాల్చి వేస్తున్నారు.

డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి



గ్రామ పంచాయతీల్లో సేకరించిన తడి, పొడి, ప్లాస్టిక్ వంటి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుల వద్ద కుప్పలుగా పోసి కాల్చుతున్నారు. ఆహార పదార్థాలు, కూరగాయల వ్యర్థాలను చెత్త నుంచి వేరు చేసి ఎరువులు తయారు చేయడం ద్వారా రైతులకు ఉపయోగం ఉంటుంది. దీంతో గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుంది.అధికారులు స్పందించి డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలి.

- ఆకుల శ్రీనివాస్, చాడ, గ్రామస్థుడు

చర్యలు తీసుకుంటాం..



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకువస్తాం. డంపింగ్ యార్డులకు తరలించిన చెత్తలో ప్లాస్టిక్ ఇతర వస్తువులను వేరు చేసి వ్యర్థాల ద్వారా కంపోస్టు ఎరువులను తయారు చేసే విధంగా చర్యలు చేపడతాం. అల కాకుండా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేసినా, కాల్చినా, వారిపై చర్యలు తీసుకుంటాం.

- కిషన్, ఎంపీవో, మోటకొండూర్

ఆదాయ మార్గాలు ఇలా..

గ్రామాల్లో సేకరించిన చెత్తలో వచ్చే ప్లాస్టిక్ బాటిళ్లు , ఖాళీ సీసాలు, కాగితాలను వేరు చేసి విక్రయించడంతో వచ్చే ఆదాయన్ని గ్రామ పంచాయతీల ఖాతాకు జమ చేయాలి. ఆహార పదార్థాలు, కూరగాయలు తదితర వ్యర్థ పాదార్థాలతో ఎరువులను తయారు చేసి హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీల్లో ఎరువుగా ఉపయోగించాలి. మిగిలిన ఎరువులను రైతులకు విక్రయించాలి. వాటినుంచి వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీ ఖాతాల్లో వేసి గ్రామ అవసరాలకు వినియోగించుకోవాలి. కానీ ఇప్పటి వరకు కంపోస్టు షెడ్లలో అలాంటి పను లేవీ అమలులోకి రాలేదు.

తడి, పొడిచెత్తను వేరు చేసి సేకరించేలా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. అమలులో మాత్రం లక్ష్యం చేరుకోలేక పోతున్నారు. డంపింగ్ యార్డులను వినియోగంలోకి తెచ్చి, కంపోస్టు ఎరువులను తయారు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, జనవరి 20: కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.జయరాజు అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన జిల్లా సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో కేసులపై న్యాయ విచారణకు అవసరమైన ఆధారాలను సేకరించడం, అదించడంలో పోలీసులతో పాటు సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖైదీల క్రిమిలనల్ కేసులపై పునఃసమీక్ష నిర్వహించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయసహాయం అందించాలన్నారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అధాలత్‌లో రాజీపడదగ్గ కేసుల పరిష్కారానికి కార్యచరణ రూపొందించాలన్నారు. సబ్ జైలు నిర్వహణపై పలు సూచనలు చేశారు. అందరి సమన్వయంతోనే కోర్టుల్లో కేసులు సత్వరంగా పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.కవిత, క్రైం బ్రాంచి డీసీపీ అరవింద్ బాబు, ఏసీపీ వెంకట్‌రెడ్డి, సబ్ జైల్ పర్యవేక్షణ అధికారి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

కురమ కులస్థుల రుణం తీర్చుకుంటా



ప్రభుత్వ విప్ అయిలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

భువనగిరి టౌన్, జనవరి 20: అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించిన కురుమ కులస్థుల రుణం తీర్చుకుంటానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన కురుమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పక్షాన కురుమలందరికీ సంక్షేమ పథకాలు, అందేలా కృషి చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామనే వాగ్దానానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కురుమ సంప్రదాయ రీతిలో ఆయనకు స్వాగతం పలికారు. సమావేశంలో యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీలు సుబ్బూరు బీరుమల్లయ్య, తోటకూరి అనురాధ, కురుమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లేశం, గువ్వల నర్సింహులు, నాయకులు జూకంటి రవీందర్, కాదూరి అచ్చయ్య పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోలుకు ఆధార్, వేలిముద్రలు తప్పనిసరి



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

రామన్నపేట, జనవరి, 20: ఎరువులను విక్రయించే సమయంలో డీలర్లు రైతుల నుంచి ఆధాకర్, వేలిముద్రలను తప్పనిసరిగా తీసుకునే ఎరువులను ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ సూచించారు. శనివారం రామన్నపేటలో ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఈవో నరసింహారావు, ఎస్‌ఐ వెంకన్న ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు సుధాకర్

భువనగిరి రూరల్, జనవరి 20: అపరిష్కృతంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, నాయకులు బి భిక్షం, పొట్ట యాదమ్మ, యాదగిరి, రాము, బుజ్జమ్మ ఉన్నారు.

ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ వాణికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ వాణిశ్రీకాంత్‌రాజ్

మోత్కూరు, జనవరి 20: ఆరాధ్య ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి 'యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ' శనివారం ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్ రాజ్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బేగంపేట మారిగోల్డ్ హోటల్‌లో న్యూ మాంక్స్ కుంగ్ ఫు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ జనరల్ ఆఫ్ టర్కియల్మాన్ ఓర్హాన్ ఓఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కుంగ్ ఫు ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్.రవికుమార్, సినీ హీరోలు నరేష్, మురళీమోహన్, మాజీ ఎంపీ సుమలత, మాజీ ఎమ్మెల్యే జయసుధ, పవిత్రలోకేష్, మాదాల రవికుమార్, శివమణి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు గుర్తింపుగా డాక్టరేట్ అవార్డు అందుకున్న వాణిశ్రీకాంత్‌రాజ్‌ను ఆరాధ్య ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు గనగాని నర్సింహ, రాష్ట్ర కమిటి సభ్యుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎ.లక్ష్మణాచారి, వెల్మినేటి జహంగీర్, బుంగపట్ల యాకయ్య, దబ్బెటి సోంబాబు అభినందించారు.

విద్యార్థుల్లో గణిత ప్రతిభను వెలికితీయాలి



గుండాల: గణిత టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

గుండాల/అడ్డగూడూరు, జనవరి 20: గణితంలో విద్యార్థుల ప్రతిభనైపుణ్యాన్ని వెలికి తీయడానికే గణిత ప్రతిభ పరీక్ష దోహదపడుతుందని ఎంఈవో శ్రీధర్ అన్నారు. మండల స్థాయిలో తెలంగాణ గణిత ఫోరం నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టును శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరివర్ధన్, తెలంగాణ గణిత ఫోరం అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగం నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సుద్దాల గణిత ఉపాధ్యాయులు దుబ్బాక జనార్ధన్ రెడ్డి, దేవరబోయిన లింగయ్య పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. అడ్డగూడూరులోని జడ్పీ ఉన్న పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్షను నిర్వహించారు. తెలుగు మీడియం నుంచి కావ్య, మనిషా, ఇంగ్లీష్ మీడియా నుంచి మౌనిక, ప్రవీణ్, కీర్తనలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీఎంఫ్ యాద్రాది జిల్లా అధ్యక్షులు భూపతి వెంకన్న, ఎంపీడీవో చంద్రమౌళి, జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రహిస్సీసా, శ్రీనివాస్, రవి, రాంగోపాల్, దామోదర్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వకారణం

బీబీనగర్, జనవరి 20: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వకారణమని జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మిషన్ శక్తి మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలపై వివక్ష చూపిస్తూ జరుగుతున్న భ్రూణ హత్యలను పూర్తిగా నిర్మూలించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్‌లు దస్తగిరి, పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, భార్గవి, మనీష, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడతాం

● చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు



ప్రభుత్వ భూమికి హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్న చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు

చౌటుప్పల్ మునిసిపాలిటీ/చౌటుప్పల్ టౌన్, జనవరి 20: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడతామని చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను బయటికి తీయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావు సమక్షంలో రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. ఇందులో భాగంగా మునిసిపాలిటీలోని సర్వే నెంబర్ 113,114 లలోని ప్రభుత్వ భూములను అధికారుల శనివారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూమికి చుట్టూ బౌండరీలను ఫిక్స్ చేశారు.

ఆక్రమణలో ఎకరం భూమి గుర్తింపు

సర్వే నెంబర్ 113 లోనే సుమారు ఎకరం భూమి ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారుల సర్వేలో తెలినట్లు తెలిసింది. ఈ ప్రభుత్వ భూమికి ఇరువైపులా ఉన్న పట్టా భూమి యజమానులు ఆక్రమించినట్లు హద్దు రాళ్లను అధికారులు నాటారు. ప్రభుత్వ భూమి చుట్టూ పెన్సింగ్ వేసి మునిసిపాలిటీకి అప్పగించనున్నట్లు ఆర్డీవో జగన్నాథరావు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో కబ్జా ఉన్న వారికి నోటీస్‌లు జారీ చేసి, వారి ఆధీనంలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు. మునిసిపల్ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్న కూడ సర్వే చేసి హద్దులు ఫిక్స్ చేస్తామని చెప్పారు. అధికారులు నిర్వహించిన సర్వే రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మునిసిపాలిటీలోని అన్ని ప్రభుత్వ భూములను సర్వే చేసి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తామని తెలిపారు. సర్వేలో డీఐ వెంకటయ్య, రెవిన్యూ అధికారులు, స్థానిక వార్డు కౌన్సిలర్ సుల్తాన్ రాజు, కాంగ్రెస్ నాయకులు సుర్కంటి వెంకట్ రెడ్డి, రవి, బడుగు మాణిక్యం పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ భూముల సర్వే సందర్భంగా ఎలాంటి అలజడి జరగకుండా ఉండేందుకు సీఐ దేవేందర్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రావి నారాయణరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేయాలి



పాదయాత్ర నిర్వహిస్తున్న రావి సేవా సంస్థ ప్రతినిధులు

భువనగిరి రూరల్, జనవరి 20: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ రావి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం పార్లమెంట్‌లో, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద, భువనగిరి జిల్లా కేంద్రంలో ఆయన కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని రావి సేవా సంస్థ ప్రతినిధులు కోరారు. శనివారం రావి స్వగ్రామమైన బొల్లేపల్లి నుంచి భువనగిరి జిల్లా కేంద్రం మీదుగా 20 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి కలెక్టరేట్‌లో అధికారురలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. వేలాది ఎకరాల సొంత భూములను పేదలకు పంపిణీ చేశాడని గుర్తు చేస్తూ నినాదాలు చేశారు. రావి జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని ఈ ప్రాంతంలోని భవనాలకు, రాయగిరిలో ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణానికి రావి నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, సెక్రటరీ రావి సుఖేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, జాయింట్ సెక్రటరీ హేమంత్‌రెడ్డి, ప్రతినిధులు భువనగిరి సత్యనారాయణ, రావి ప్రతిభ, సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ గోద శ్రీనివాస్, డాక్టర్ విజయ్ భార్గవ్, మహేష్ ఉన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరి టౌన్, జనవరి 20: తెలంగాణ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు అర్హత పరీక్ష దరఖాస్తుల గడువును ఈ నెల 23 వరకు పొడగించినట్లు భువనగిరి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలయాలను స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలి



చౌటుప్పల్‌లోని మార్కండేయ దేవాలయంలో శుభ్రం చేస్తున్న శ్రీధర్‌బాబు

చౌటుప్పల్ టౌన్/ వలిగొండ, జనవరి 20: ప్రతి దేవాలయాన్ని రామ భక్తులు స్వచ్ఛందంగా పరిశుభ్రం చేసుకోవాలని చౌటుప్పల్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పి. శ్రీధర్ బాబు అన్నారు. ఈ నెల 22 న అయోధ్య లో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట ను పురష్కరించుకొని శనివారం స్థానిక శివ భక్త మార్కండేయ దేవాలయం, సీతారామచంద్ర స్వామి దేవాలయాలను బీజేపీ నాయకులతో పాటు రామ భక్తులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అయోధ్య లో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఒక్క ఇంటిలో పూజలు చేయాలని, దీపాలు వెలిగిచాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో శివభక్త మార్కండేయ దేవాలయం అధ్యక్షుడు గోశిక నర్సింహ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునిసిపాలిటీ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశ్, మండల ఇన్‌చార్జ్ జి.సురేందర్‌రెడ్డి, నాయకులు డి. బిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసుల వెంకటేష్, ఎల్లంకి పాండు, కె.దుర్గయ్య, రమ్య, రాజపేట అశోక్, పురుషోత్తం, కృష్ణ, రవి పాల్గొన్నారు. వలిగొండ మండలంలో పలు గ్రామాల్లో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని, శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బందారపు రాములు, భక్తులు పరిపూర్ణాచారి, శంకరయ్య, అయిలయ్య, లింగస్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.



థర్మకోల్‌తో రామమందిరం నమూనాను తయారు చేసిన విద్యార్థి హృతిక్

థర్మకోల్‌తో రామమందిరం నమూనా

మోత్కూరు : మోత్కూరు పట్టణానికి చెందిన గనగాని అనిల్, పావని దంపతుల కుమారుడు హృతిక్ థర్మకోల్‌తో అయోధ్య రామ మందిరం నమూనాను చూడ ముచ్చటగా తయారు చేశాడు. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆరో తరగతి చదువుతున్న హృతిక్ ఎవరి సహకారం లేకుండా తన ఆలోచనతో రామ మందిరం నమూనాను తయారు చేయడాన్ని చూసిన వారంతా హృతిక్‌ను అభినందిస్తున్నారు. కాగా హృతిక్ తండ్రి అనిల్ పెళ్లిపందిళ్ల డెకరేషన్ చేసే వృత్తిలో ఉన్నాడు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించేలా చూడాలి



మోత్కూరు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిఫెన్స్ వినియోగదారుల సంఘం ప్రతినిధులు

మోత్కూరు, జనవరి 20: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలోని హోటళ్లలో పరిశుభ్రత పాటించేలా, నాణ్యమైన ఆహారపదార్థాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిఫెన్స్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు గుమిడెల్లి పరశురాములు కోరారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం మోత్కూరు మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. హోటల్ యజమానులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వినియోగదారుడికి బిల్లు ఇవ్వడం లేదని, ఆహార పదార్థాలు తయారు చేసేందుకు వాడే పిండి, నూనె తదితర సరుకులు నాణ్యతగా ఉండటంలేదని, వంట మాస్టర్లు వంట చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం లేదని పేర్కొన్నారు. ప్లేట్లు, టేబుళ్లు, గ్లాసులు శుభ్రంగా ఉండటం లేదని ఆయన కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎర్రవెల్లి నాగేష్, సభ్యులు శివరాత్రి మత్స్యగిరి, ఇటికాల నరేష్, గుగ్గిళ్ల కృష్ణ, మర్రి కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

వలిగొండ: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య, బండ జంగమ్మ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ భీమా చెక్కు చెరొక రూ.2లక్షల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, నాయకులు పలుసం రమేష్, తుమ్మల వెంకట్‌రెడ్డి, వల్లమల్ల కృష్ణ, ఎల్లంకి స్వామి, సలీం, నాగార్జున, సత్తయ్య, మారయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : ఎన్ఎస్‌యూఐ మోత్కూరు మండల అధ్యక్షుడిగా మోత్కూరు పట్టణానికి చెందిన నిమ్మల శ్రీనివాస్‌యాదవ్ నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

గుండాల: ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా పెద్దపడిశాల గ్రామానికి చెందిన బండెల ప్రమోద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి క్యాసగల్ల రమేశ్, నాయకులు యాదగిరి, ఎర్ర నరేశ్ ఉన్నారు.

ఆలేరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 29న పాఠశాల యాజమాన్యం కమిటీల ఎన్నికలు నిర్వహించాలని మండల విద్యాధికారి జంగిటి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ఆలేరు రూరల్: ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని ఆలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ ఖుర్షీద్‌పాషా కోరారు. శనివారం ఆలేరులో జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను అందించాలన్నారు.

అడ్డగూడూరు: మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన చేపూరి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం యాద్రాది జిల్లా అధ్యక్షులు మెట్టు హరి శనివారం నియామక పత్రం అందజేశారు.

అడ్డగూడూరు: మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో తుంగతుర్తి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు సుధీర్ ప్రేయర్ పవర్ చర్చి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ గౌరవ అధ్యక్షుడు విపి డానియల్, నియోజకవర్గ అధ్యక్షుడు మందుల బాబురావు, గాజుల రమేష్, అశోక్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

అడ్డగూడూరు: మండలంలోని అడ్డగూడూరు, మానాయికుంట, గట్టుసింగారం, ఆజీంపేట, వేల్దేవి, మంగమ్మగూడెం గ్రామాల్లో తహసీల్దార్ శేషగిరిరావు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించారు.

వలిగొండ: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని సీనియర్ నాయకులు పబ్బు ఉపేందర్ బోస్, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి కృష్ణపర్ కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని నాలుగో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి, అండమ్మ, భార్గవి, సంస్థ సభ్యులు గిరిబాబు, ఎల్లాచారి ఉన్నారు.

బొమ్మలరామారం: కానుగ, కరివేపాకు, మునగ మొక్కలను పెంచి గ్రామంలో ఇంటింటికి ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఎంపీడీవో సరిత ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: గీత కార్మికుల కోసం తాటివనాన్ని పెంపకానికి 10 ఎకరాల భూమిని కెటాయించాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్రకార్యదర్శి బొలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో తెలంగాణ గీత పనివారల సంఘం క్యాంలెడర్‌ను ఆవిష్కరించారు. గోద శ్రీరాములు, రాష్ట్ర సమితి సభ్యులు కళ్లెం కృష్ణ, గోపగాని రాజు, రాజు ఉన్నారు.

మోటకొండూర్ : గీత వృత్తిపై ఆధారపడిన లక్షలాది పేద, వెనుకబడిన వృత్తిదారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గీత పనివారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని గౌడ సంఘం అవరణలో రాష్ట్ర గీత పనివారుల సంఘం క్యాలెండర్‌ను అవిష్కరించారు. గాజుల వెంకటేష్, తండ రాములు, గడ్డం అంజయ్య, గాదెగాని మాణిక్యం, తాళ్లపల్లి వెంకటయ్య, జహంగీర్ ఉన్నారు.